అపజయము

శ్రీమతి రాణీ చాకుంట సరస్వతీబాయిగారు

గత సంచిక తరువాయి

[లలిత భాస్కరరావు సోదరి. పద్మ వీరికి స్నేహితురాలు. లలితకు సహపాఠి. మాతాపితలు లేనిది. లలితా భాస్కరులతో కూడి ఆడుకొంటూ వుండేది. భాస్కరరావు బార్ అట్ లా చదవడానికి ఇంగ్లండు వెళ్లేడు. లలితా పద్మలు మెట్రికులేషను పరీక్ష ముగించారు. లలితకు వివాహనిర్ణయమైంది. చిన్నప్పటినుండీ మగవాళ్లంటే గిట్టని పద్మ కది రుచించిందిగాదు. మగవారి దౌర్జన్యాలు ఏకరువు పెడుతూ లలితను పెళ్లి మానేయుమంది. కాని లలిత ఆశయాలు వేరు. పెళ్లి చేసుకొంది. పద్మకు కోపం వచ్చింది. ఆడువారి అబలత్వాన్ని నిందించింది. ఆ ఆశయాలతోనే బి. ఎ. ప్యాసయింది. స్త్రీలు పెళ్లాడి బాధలెందు కనుభవించాలి అనే ధోరణిలోనే ఎపుడూ వుండేది. తరువాత కథ చదువండి.]

౪

"లలితా! బి.ఏ. ప్యాసయ్యాను. నీవలెనే తిన్నతిన్నగా మిత్రురాండ్రందరు నన్ను వదలి పోయినారు. అనగా వివాహాలు చేసుకొని అత్తవారిండ్లకు వెళ్లారు. నామాట లొక్కరికైన చెవుల కెక్కలేదుగదా అన్న విచారం. మన జాతిలో ఇంత దుర్బల ముండడం వల్లనే పురుషస్వాములు మన నిలా బాధిస్తున్నారు.

ఇక నాస్థితి. మాట్లాడ్డానికి కెవరూ లేరు. దినమంతా గ్రంథాలు, వార్తాపత్రికలు చదువుతుంటాను. చదువుతూ చదువుతూ విసిగినప్పుడు మాత్రం ఎవరైన మాట్లాడ్డానికి, సాయంత్రం షికారుకు వెళ్లడానికి ఉంటే బాగుంటుం దనిపిస్తుంది. మా వదినెకు యింటిపనులవల్ల తీరికే లేదు పాపం. ఏంచేయాలీ తోచదు. రాత్రిళ్లు గూడా ఏదో ఆవేదనగా ఉంటుంది. త్వరగా నిద్రపట్టదు. పట్టినాకలత నిద్ర.

మన మిత్రులలో ఒకళ్లైన ఉత్తరం వ్రాయరు. వాళ్లు ప్రస్తుతం తమ యానందంలో నన్ను మరచుంటారు. ముందుముం దెన్నటికైనా జ్ఞాపకానికి వస్తాను. వారి యీ ఆనందం అస్థిరమైందనే నా కింకా నమ్మకం. కాబట్టి నామాట లెన్నటికైనా నిజం గాకుండాపోవు.

"సోదరీ! నీవైన మర చిపోవనుకుంటాను నన్ను. వారంరోజుల కొకసారైన ఉత్తరం వ్రాయుచుండుము. నే నెల్లప్పుడూ మీ శ్రేయమే కోరుచుందును. కాబట్టి శంకించక నీ కష్టసుఖములను తెల్పుచుండుము. ముందేమి రానున్నా యిప్పుడు మాత్రం సుఖిస్తూనే ఉన్నారు. అదే పదివేలు.

ఇట్లు

పద్మ."

ఈ ఉత్తరంవల్ల నాకు కొంత విచారం గల్గినప్పటికీ, పద్మహృదయ మొక కోరి

కతో బాధపడుచున్నది. ఆబాధ నివారించు మందు, దాని అన్న నిర్బంధము వల్లనైనా పుచ్చుకొనక తప్పదు.

పద్మ ఉత్తరానికి ప్రత్యుత్తర మిచ్చాను. దానిబాధ నుపశమింపజేయునది, జీవితానంద మొసంగునది, వివాహమేనని దాని నిర్వహణార్థము తగినవరుని తానే చూచు కొనుట మంచిదనిగూడా వ్రాశాను.

నే నీ ఉత్తరం వ్రాసిన కొలదికాలానికే మా పద్మను చూడడం తటస్థించింది. మా అన్నయ్య బ్యారిస్టరీ పరీక్షలో ఉత్తీర్ణుడై యింటికి వస్తున్నాడు. మా దంపతుల కాహ్వానం వచ్చింది. ఇద్దరం వెళ్లాం మా పుట్టింటికి.

పద్మ బొత్తుగా మారిపోయింది. ముఖం పాలిపోయింది. ఇపుడా ఉత్సాహం, ఆ చిరునవ్వు, ఆకాంతి పద్మముఖంలో కన బడడంలేదు. దాని ముఖం ఎండి నవ్యత నొందడానికి సుధావర్షము కోరుతున్న ట్లుంది. ఎప్పు డేదో ఆలోచిస్తూనే ఉం టుంది. ఎవరితోగూడ ఎక్కువ మాట్లా డదు. దాని మనస్సులో ఏదో బాధపడు తూ న్నట్లనిపించింది నాకు. ఆ బాధకు కారణం దానికిగల రెండు వ్యతిరేకాభి ప్రాయములే. వివాహం చేసుకోవడమా? చేసుకోకపోవడమా? మాటపట్టుదలగల పద్మ త్వరగా తన పరాజయాన్ని ఒప్పుకో వడంలేదు. తనకు గలిగిన కోరిక నణచి వేయడానికే విశ్వప్రయత్నం చేస్తోంది.

పద్మను చూడడానికి వెళ్లాను. కుశల ప్రశ్నలైనయి. దాని యీస్థితికి కారణ మడిగాను. చెప్పలేదు. రాత్రిళ్లు ఎక్కు వగా చదవడంవల్ల యిలాంటి మార్పు గల్గిందన్నది. కాని నన్ను చూడ్డంతోటే అవమానం గల్గింది దానికి. దాన్ని కప్పి పుచ్చే ప్రయత్నం చేసింది. లేని నవ్వు తెచ్చిపెట్టుకుంది. దాని యవస్థచూచి నాకు జాలిగల్గింది. మా అన్నయ్య "రేపు వస్తున్నాడు, నీ బాల్యస్నేహితుడు స్టేషన్కు వస్తావా" అని అడిగాను. "నమ్మకంలేదు. రేపు చూద్దాంలే" అన్నది. నేను లేచి ఇంటికి వెళ్లాను.

౨

మా ఇల్లంతా మహానందంలో మునిగి తేలుతోంది. మా అన్నయ్య బొంబాయి నుండి టెలిగ్రా మిచ్చాడు. నిర్దేశింపబడిన వేళకు మా నాన్న, నేను, మావారు స్టేషన్ చేరుకున్నాం. అన్నయ్య నెదుర్కో వడానికి పద్మను రమ్మని మళ్లీ కబురు చేశాను. శరీరం స్వస్థతగాలేదని రానంది. ఇలాంటి సంతోషాల్లో అందరికన్న ముందు దూకే పద్మ ఇప్పుడు అందరికంటే వెనుక బడ్డది. తా నేదో గొప్ప అపరాధం చేస్తు న్నట్లు భయపడుతుంది మాతో సంచరించ డానికి.

రైలు రాగానే రెండవ తరగతి బండి వద్దకి వెళ్లాం మా అన్నయ్యదిగాడు. మా మనుష్యులు ఆయన సామాన్లు తీస్తు న్నారు. ఎంతోకాలానికి చూచాడు స్వజ నాన్ని అన్నయ్య. మాకందరి కొకేసారి

ఆనందబాష్పాలురాలినై. అందరితో కల్సి ఇటూ అటూ చూస్తున్నాడు. "మన పద్మ రాలేదేం? పాపం భర్తతో కాపురం చేస్తుంటే రావడాని కెలాకుదురుతుంది" అన్నాడు నిరాసతో. "ఆమె శరీరంలో అస్వస్థతగా ఉందిట. అందువల్ల రాలే దన్నయ్యా!" అన్నాను నేను. మేమంతా ఇల్లు చేరుకున్నాం సంతోషంగా.

మరుసటిరోజు పద్మవద్దకి వెళ్లాను అన్నయ్య రమ్మన్నాడని చెప్పడానికి. నేను వెళ్లేవరకు పద్మ తనలో తానేదో ఆలోచించుకొని ముసిముసి నవ్వులు నవ్వుకుంటోంది. దాని యీస్థితి నన్ను సంతోష పెట్టింది. కాని దీనికి కారణం? నన్ను తొందరగానే ఎదురుకొని కూర్చోమంది. అన్నయ్యను గురించి కుశలప్రశ్న లడిగింది. ఆయన్ను గురించి క్లుప్తంగా కొన్ని విషయాలు చెప్పి, తన్ను చూడ్డానికి రమ్మన్నాడని చెప్పాను.

పద్మ:—సరే! ఇన్ని సంగతులు చెప్పావు గాని మీ అన్నయ్య ఒక లేడీని మెడకు గట్టుకొచ్చాడా? మన బ్యారిస్టర్‌గార్ల కదె మొదటి క్వాలిఫికేషన్.

నేను:—చెప్ప మరిచాను. తెచ్చుకున్నాడు. అహాహా! ఆమె అందం చెప్పడానికి నా తరంకాదు. ఆమెను చూపడానికే ఇప్పుడు రమ్మనడం.

ఈమాట విన్నంతోనే ఒకనిట్టూర్పువిడిచింది పద్మ. "మన భారతీయయువకులు తమశీలాన్ని పాడుచేసుకుంటున్నారు గదా" అంది విచారంతో. పద్మ నాకు వదినైతే బాగుండే దనిపించింది. వారి దాంపత్యం అనన్యసామాన్యంగా ఉంటుంది. దైవేచ్ఛ ఎలాఉందో.

"పద్మా? లేవేం! వెళదాం! పాపం అన్నయ్య నిరీక్షిస్తుంటాడు" అన్నాను.

పద్మ:—నన్నాట్టే నిర్బంధపెట్టబోకు. తొందరేంవచ్చింది. చూద్దాంలే. అయినా యౌవనమందున్న పురుషులను చూడాలన్నా, మాట్లాడాలన్నా భయమేస్తుంది. కాబట్టి ఇప్పటికి "క్షమించ ప్రార్థించితి"నని చెప్పుమీఅన్నతో. ఇన్నాళ్లైనా పద్మ జ్ఞాపకంఉన్నందులకు నాకృతజ్ఞతావందనము నీవే వారి కందచేయి.

"యీదొంగవేషాలన్నీ కట్టిపెట్టు, నీవు రాకతప్పదు" అని పద్మనుచేయిబట్టిలాగాను. లేచి "సరేపద" అని బయల్దేరింది.

దారిలో "సరేగాని లలితా! నిజంగా భావి-రావుగా రొక ఆంగ్లస్త్రీని వివాహం చేసుకున్నాడా? మీనాన్న ఆమెనింటికెలా రానిచ్చాడు. మీఅమ్మ గోలపెట్టడం లేదూ?" అంది.

నాకు నవ్వొచ్చింది "తొందరపడతావేం? అన్నీ తెలుస్తాయిగా!" అన్నాను నవ్వుతూనే.

మాయిల్లు ప్రవేశించాం. మాఅన్నయ్య మా యల్.యల్.బి. గారూ ఏదో మాట్లాడుతూకూర్చున్నారు. అక్కడికే వెళ్లాం. "అన్నయ్యా! పాపం పద్మ మీఇంగ్లీషులేడీ

గార్ని చూడాలనోచ్చింది. చూపింపరేం'' అన్నాను నవ్వుతో. వారిద్దరూ నవ్వారు. పద్మకు కోపంవచ్చింది. పరాజయం లభించింది పాపం!

భా:—పద్మం! కూర్చో. నీవింతదనుక వివాహం చేసుకోకుండాఉండి బి.ఏ. చదివావంటే చాలసంతోషించాను. ముఖమంతా పాలిపోయింది. జబ్బేమన్నా చేసిందా? లేక ఎక్కువగా చదవడంవల్ల ఇలా మారిపోయినావా?

పద్మ:—జబ్బేంలేదు. చదవడంవల్లనే ఇలా అయిందనుకుంటాను.

నేను:—అదీకాదన్నయ్యా! మీ పురుషుల నందరినీ ఒక మహాసముద్రంలోముంచి, తాను మహారాజ్ఞిగా, తనప్రజలంతా స్త్రీలుగా, యీ ప్రపంచాన్నేలుకోవడానికి మార్గాలాలోచిస్తోంది. ఆ ఆలోచనల్లోనే నిద్రాహారాలుగూడ మానేసిందేమో?

భా:—ఇప్పుడుగూడ నీవు మాఅందరికీ మహారాణివే. మేము నీఆజ్ఞలకు బద్ధులమే. దాని కింతప్రయాసం ఎందుకు పద్మా!

పద్మ:—లలితా! వేళాకోళంచేయడానికా నన్నిక్కడికి రమ్మన్నావు?

నేను:—నిజంచెప్తే నీకింతకోపం ఎందుకు?

భా:—పద్మా! పోనీ ఆసంగతి డ్రాప్ చేద్దాం! గాని చిన్నప్పటికళాకాంతులు లేవేం నీముఖంలో? అదిగాక నాముందు సిగ్గుగూడ పడుతున్నావు. కారణం?

పద్మ:—సిగ్గెందుకు? అయినా బాల్యావస్థే ఎల్లకాలంఉంటుందా?

భా:—ఏండ్లు వచ్చినయి. అంతేగాని నాకు నిన్నుచూస్తే మళ్లీ ఒకపరియాయం నీతో ఆడుకోవా లనిపిస్తుంది.

నేను:—అబ్బో! చాలా పెద్దకోరికే కోరావు అన్నయ్యా!

భా:—ఇందులో తప్పేముంది. చదువుకున్నవాళ్లల్లోగూడ పూర్వపుభావా లుండవనుకుంటాను.

నేను:—అలాకాదు. పద్మాదేవిగార్కి అసలు పురుషులంటేనే గిట్టదంటే నీతో ఎలా ఆడుకుంటుంది. నీవు పురుషుడవు కావా?

పద్మ:—తిర్గి నీఉపన్యాసం మొదలెట్టావు లలితా! నిన్ను మాట్లాడించిందెవరు?

"మీరే మాట్లాడుకోండి నేను వెడతాను" అని లేచి లోపలికివెళ్లాను. మా యల్.యల్.బి.గారిదివరకే స్నానానికి వెళ్లారు.

వారిద్దరూ సుమారొకగంటసేపు మాట్లాడుకొన్నారు. ఇంగ్లాండువిషయాలు కొన్ని మాఅన్నయ్యచెప్తూంటే లోపల ఉండి విన్నాను.

౬

నేనూ అన్నయ్యా, పద్మ షికారుకు వెడుతుండేవాళ్లం సాయంత్రం. పద్మముఖంలో జీవం కనబడుతుంది. ఇది భాస్కరసందర్శన

మహాత్మ్యమేమో ననుకున్నాను. అది ప్రకృతి సిద్ధమేగా !

పద్మ ఇంట్లోనే ఆగిపోయినాను నిర్బంధం వల్ల సాయంత్రం షికారునుండివస్తూ. లోపలికి వెళ్లగానే పరధ్యానంగా అన్నట్లుగా అన్నాను. "పాపం! పద్మం శీతకరకిరణ ప్రసాదమున కృషించి ముకుళించి యిప్పుడిపుడే భాస్కరోదయమున ముసిముసి నవ్వులు నవ్వుతోంది."

"ఏం లలితా! నీకేం మతిపోయిందా? రాత్రిపూట భాస్కరోదయమేమిటి? పద్మం వికసించడమేమిటి" అని నవ్వింది పద్మ.

నేనూ:—నవ్వుతూ "ప్రియసందర్శనం పద్మాని కెంతసంతోషం కలిగించింది. ప్రకృతిలో భగవంతుడొక ప్రత్యేకవ్యక్తికి, మరొక ప్రత్యేకవ్యక్తితో ప్రేమబంధమేర్పచి యుంచాడుగదా" అన్నాను.

"ఎప్పుడూ నీకు ప్రేమ, ప్రియులముచ్చటలే. బ్రహ్మచారిణి ముందలాంటిమాటలు ముందెన్నడూ మాట్లాడుబోకు" అన్నది చిరునవ్వుతో.

నేను:—అలాగేం! తమరుకూడ గృహిణులైతే ఇంతకన్న ఎక్కువే కావాలి. తొందరెందుకు. కొద్దిలోనేఉంది.

పద్మ:—అయితే! నేను వివాహం చేసుకుంటాననే నీయభిప్రాయం? ఎన్నటికీ చేసుకోను.

ఆమాటల్లో పూర్వపు పట్టుదల కనబడలేదు.

పద్మ:—అదంతా ఏమోగాని, పురుషులతో ఆపవిత్రదాంపత్యసంబంధంకంటే స్నేహభావంతో నిర్మలంగా సంచరిస్తే బాగనిపిస్తుంది.

నేను:—అవు నలాగే తోస్తుందిపుడు. ముందు —

పద్మ:—ముందు? ముందేమైతుంది?

నేను:—ఏమైతుందో నేను చెప్పను, గాని నిన్న మీ అన్నయ్య మాఇంటికివచ్చి మానాన్నతో ఏమో మాట్లాడుతున్నారు.

పద్మ:—(ఆత్రంతో) ఏమిమాట్లాడారు? నీకేమైనా తెలుస్తే చెప్పు!

"నాకేం తెలుసు. మీఅన్నయ్యనే అడగగూడదూ?" అని లేచాను వెళ్లడానికి. పద్మ యింకా కూర్చోమన్నది కాని రాత్రైనందున వేళైందని బయల్దేరేను.

"వదినా! తిర్గిరేపు దర్శనం చేసుకుంటారు" అని అంటూ పరుగెత్తాను. పద్మ లోనికి వెళ్లిపోయిం దనుకుంటాను.

మాయింట్లో అందరం భోజనాలు చేస్తున్నాం. పద్మసోదరుడు మాట్లాడినవిషయం చెప్పారునాన్న. భాస్కర్రావుకు పద్మతో వివాహంచేయాలని ఉందన్నాడు. మానాన్న వరదక్షిణాపక్షమువాడు కాడు. లేకుంటే అన్నయ్య ఇంగ్లాండువెళ్లిన ఖర్చులైన సంపాదించేవాడే. భాస్కరునడిగి చెప్తానన్నాట్ట. అన్నయ్య తలవంచుకొని లోలోననవ్వుకుంటున్నాడు.

"ఏం! భాస్కర్! పద్మతో వివాహం నీకిష్టమేనా?" అన్నాడు నాన్న.

భాస్క:—నాన్నా! ఆ పిల్ల అసలే వివాహం చేసుకోకుండా జీవితం సాంతం బ్రహ్మచర్యంగా గడుప దలచిందటగా?

మాఅమ్మ వడ్డిస్తూ "ఏమోనండి మహా గడుసుపిల్ల. చదువుకున్నాళ్ల కిదోరోగం" అంది.

మేమంతా నవ్వాం. "కోడలిమీద హుకుమ్ చలాయించటానికి వీల్లేదనా? ఆక్షేపిస్తున్నావు" అన్నాడు నాన్న.

నేను:—అసలు పద్మ మీకు కోడలు కావడ మెలా? వివాహం చేసుకోదుట నాన్నా!

నాన్న:—అదంతా వాండ్ల అన్నయ్య ఏర్పాటు చేసుకోందే నాతో ఎలా మాట్లాడుతాడు.

నేను:—పద్మకిష్టమైతే అన్నయ్యనొప్పించే పూచీ నాది.

భోజనాలు పూర్తిఅయినవి లేచాం.

అంతా నిశ్చయమైంది. ముహూర్తంగూడ పెట్టుకున్నారు. పద్మ, వాళ్ల అన్న వదినె ఒకేతీరుగా నిర్బంధపెట్టడంవల్ల ఎలాగో ఒప్పుకుందిట! అయినా లోకులంతా దంపతులుగా భావించినా తానుమాత్రం అలా ఉండదట. ముడిపడ్డాక ఏలాఉన్న సరే ననుకున్నాను.

బంధువులంతా వచ్చారు. ఎంతోమంది మిత్రులువచ్చిరి. వివాహం మహావైభవంగా జర్గింది. తగుమూకలులేవు. బ్రాహ్మణ సంతర్పణలులేవు ఒక్కదినముతప్ప. తక్కిన నాల్గుదినములు బీదలకు పెట్టించాం. చూచిన వారు, విన్నవారుగూడ ఆనందించారు వీరి దాంపత్యానికి. వధువు 18 సంవత్సరముల కన్య బి. ఏ. ప్యాసైంది. వరుడు బ్యారిస్టర్ 25 సంవత్సరముల బ్రహ్మచారి. ఇద్దరు బాల్యమిత్రులు. ఒకరినొకరు వరించుకున్నారు. ఈ మధ్యకాలంలో బాల్యవివాహములు ప్రబలి మనసంఘాన్ని పాడుచేసినయి గాని పూర్వం ఆర్యుల్లో యిలాంటి వివాహాలే జర్గుతుండేవట.

వివాహం పూర్తిఅయింది. ఆరవనాడు సాయింత్రం మాఅన్నయ్యా, పద్మా, తోటలో తిర్గుతున్నారు. చిన్నగా నేను వారిని వెంబడించాను కానరాకుండా, నాచేతులో క్యామరాఉంది. వారొకచోట కూర్చున్నారు. పద్మభుజంమీంద అన్నయ్య చేయి వుంది. పద్మ తనతల అన్నయ్య భుజం మీందపెట్టి అధోముఖం చూస్తోంది. ఇదే సమయమని స్నాప్ కొట్టాను. నా కోరిక నెరవేరింది.

మర్నాటివరకు ఫోటో తయారైంది నా కోరికప్రకారం. దానిక్రింద "అపజయము" అని వ్రాశాను.

ఈపటం తీసుకోని అన్నయ్యా గది ముందుకు వెళ్లాను. లోపల నూతన దంపతులున్నారు. 'నేను లోనికి రావచ్చునా?'

అన్నాను. ''సంతోషంగా'' అన్నా డన్న య్య. లోనికి వెళ్లాను. ''అన్నయ్యా! నీ కో ఫోటో చూపిస్తాను. మహాచిత్ర మైంది, గాని వదినెతో మాత్రం దానిసంగతి చెప్పకు'' అన్నాను పద్మవైపు చూస్తూ. పద్మ ముఖం వాల్చుకుంది తనకుగూడా చూపలేదన్న కోపంతో. అన్నయ్య ఫోటో చూచి ఒక్కపెట్టున నవ్వాడు, పద్మవైపు చూస్తూ.

పద్మ:—ఏమి టా సంతోషం, పట్ట లేకుండా ఉన్నారు?

''వదినా! నీ కెందుకు కోపం! పోనీ, నీవుకూడ చూడు'' అంటూ చూపించాను చిత్రాన్ని. కోపంవచ్చింది, తన పరాజ యాన్ని చిత్రించానని. 'అబ్బా! ఏం దొంగవేషాలు!' అన్నది.

నేను:—వదినా! యీదంపతులు ప్రపం చంలోకల్లా అద్వితీయులు, కాబట్టి యిలాంటి చిత్రాన్ని ఏదైన పత్రికకు పంపి స్తాను మీ పేర్లుగూడ పైనవ్రాసి. అనుజ్ఞ యిస్తావా?

''ఏమో? ఏమన్నా చేసుకో! నా కెం దుకు? నాఅనుజ్ఞ తీసుకొనే ఈపని చేశావా? ఇప్పుడుమాత్రం నాఅనుజ్ఞ ఏల?'' అంటూ కోపంతో బైటకువెళ్లింది ఆ పటం గుంజుకొని.

గమనింపు

రాబోవు అక్టోబరు మాసారంభమున యథాప్రకారము గృహ లక్ష్మి దసరా సంచిక వెలువడును. దానిలో స్త్రీలచే మాత్రము రచియింపబడు వివిధవిషయములకు సంబంధించిన చక్కని పద్య గద్య వ్యాసములు ప్రకటింపబడును. దీని కాంధ్ర విద్వత్సోదరీమణుల సాహాయ్య మత్యంతావశ్యకము. కావున సోదరీమణులెల్ల తమ పద్య గద్య వ్యాసములను సాధ్యమైనంత త్వరగా బంపి దసరా గృహలక్ష్మి సర్వాంగ సుందరిగా వెలువడునట్లు తోడ్పడుదురని మనవి. రచయితలు తమ ఛాయాచిత్రములనుగూడ పంప ప్రార్థన.

సంపాదకుడు.